ఆపన్నులకు అండగా సీఎం సహాయ నిధి

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

బాధితుడికి సీఎం సహాయ నిధి మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , జూన్ 3 : అపన్నులకు అండగా సీఎం సహాయ నిధి పథకం నిలుస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ అడ్డగుట్టకు చెందిన అర్జున షణ్ముఖకు అత్యవసర వైద్య సేవల నిమిత్తం సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.60 వేల ఆర్థిక సాయం నిధుల మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే సోమవారం తన నివాసంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో ధైర్యాన్నిస్తున్నదని, ఈ పథకం సాయంతో కార్పొరేట్ దవాఖానల్లో ఉచితంగా వైద్యం పొందుతున్నారన్నారు . సకాలంలో బాధితులకు సాయం అందేలా కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఉప్పల్, జూన్ 3: ఉప్పల్ న్యూభరత్‌నగర్‌లోని సిగ్మా హోటల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఉప్పల్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు బెట్టింగ్ పెట్టి, పేకాట ఆడుతున్న వారిని గుర్తించారు. ఈ మేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు వేడుకల్లో భాగంగా జాతీయపతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

మేడ్చల్ జిల్లా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

తెలంగాణ ప్రగతి ఘనత కేసీఆర్‌దే..

రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు వేడుకల్లో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

దుండిగల్, జూన్ 3 : రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు ఉత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, గండిమైసమ్మలోని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండా,పార్టీ పతాకాలను వేరువేరుగా పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఏర్పాటుకు ముందు.. ఆ తర్వాత పరిస్థితులను కండ్లకు కట్టినట్లు వీడియో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ రాష్ట్రం కోసమైతే ప్రాణత్యాగాలు, ఉద్యమాలు జరిగాయో అవన్నీ ఫలించి, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన దశాబ్ద కాలంలోనే తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిందని..ఈ ఘనత తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, పీఏసీఎస్ చైర్మన్, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి..

- 2 వేలలోపు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు...28 టేబుళ్లు.. 23 రౌండ్లలో కౌంటింగ్
- ఫలితాల వీక్షణకు గచ్చిబౌలి ఫ్లై ఓవర్ కింద భారీ స్క్రీన్..

మియాపూర్ , జూన్ 3 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం అయింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గపు ఓట్ల లెక్కింపు సైతం రాజేంద్రనగర్‌లోని బండారీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇందుకోసం గడచిన కొద్ది రోజులుగా జిల్లా కలెక్టర్ శశాంక్ నేతృత్వంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, నియోజకవర్గ ఏఆర్‌వో స్నేహ శబరీష్ తగు ఏర్పాట్లు పూర్తి చేయించారు. కౌంటింగ్ సిబ్బంది నియామకం, కౌంటింగ్ ప్రక్రియపై తగు శిక్షణ , ఏజెంట్ల నియామకం, వారికి పాసుల జారీ ప్రక్రియను అధికారులు ముందస్తుగా పూర్తి చేశారు. రాష్ట్రంలో అతి పెద్దదైన శేరిలింగంపల్లి నియోజకవర్గపు పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అక్కడి కేంద్రంలో 28 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 23 రౌండ్లలో కౌంటింగ్‌ను పూర్తి చేయనున్నారు. ఒక్కో టేబుల్‌కు ముగ్గురు చొప్పున లెక్కింపు సిబ్బందిని ఇప్పటికే కేటాయించారు. కాగా.. నియోజకవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు ప్రక్రియలో సుమారు 100 మంది వరకు సిబ్బంది భాగస్వాములు కానున్నారు. కౌంటింగ్ ప్రక్రియ యావత్తు వెబ్ క్యాస్టింగ్ నీడలో జరగనున్నది. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను నియోజకవర్గ ఏఆర్‌వో స్నేహ నేతృత్వంలో పూర్తయ్యాయి. కాగా.. నియోజకవర్గంలో 85 ఏండ్లకు పై బడిన వారితోపాటు ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరివి కలిపి 2వేలలోపు పోస్టల్ ఓట్లు పోలయ్యాయి. వీటిని లెక్కింపు కేంద్రంలోని ప్రత్యేక గదిలో అన్ని నియోజకవర్గాలతో పాటే లెక్కించనున్నారు. ఎన్నికల ఫలితాలను ప్రజలు వీక్షించే వీలుగా శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని గచ్చిబౌలి ఫ్లై ఓవర్ కింద భారీ స్క్రీన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. తద్వారా నియోజకవర్గంతోపాటు యావత్ లెక్కింపు ఫలితాలను ప్రజలు ఆ స్క్రీన్‌లో చూసే అవకాశం కల్పిస్తున్నారు. ఏఆర్‌వో స్నేహ శబరీష్‌తోపాటు డీసీలు రజనీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, జోనల్ డీసీ వేణుగోపాల్‌రెడ్డిలు లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3 : కేపీహెచ్‌బీ కాలనీ సర్దార్‌పటేల్ నగర్‌లోని శ్రీలక్ష్మీగోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు కోలాహలంగా సాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావులు ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వరస్వామి దేవాలయ సన్నిధిలో వేద పండితుల అశీర్వచనం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్కన్నగారి కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, అంబటి శ్రీనివాస్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. .

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్స వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, భక్తులు

వివిధ బీఈ కోర్సుల

పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ బీఈ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) తదితర కోర్సుల ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 20 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులకు, సిబ్బందికి శిక్షణ

కుత్బుల్లాపూర్, జూన్ 3 : నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో భాగంగా అధికారులకు, సిబ్బందికి సోమవారం కుత్బుల్లాపూర్ ఏఆర్ఓ పులి సైదులు అవగాహన కల్పించారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానంలోని కుత్బుల్లాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పడిన ఓట్ల లెక్కింపు బోగారంలోని హోలీమేరీ కళాశాలలో జరగనున్న నేపథ్యంలో పాటిం చవలసిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జయంతి రెడ్డి

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

అల్లాపూర్, జూన్ 3: మోతీనగర్ శ్రీ శారదా శృంగేరి శంకరమఠం 25వ వార్షికోత్సం సందర్భంగా సోమవారం మహిళలకు నిర్వహించిన ఉచిత వైద్యం శిబిరానికి విశేష స్పందన లభించిందని సేవాభారతి ట్రస్ట్ సభ్యుడు బైరెడ్డి సూర్యనారాయణ అన్నారు. జేజే హాస్పిటల్, సేవాభారతి ట్రస్ట్,సాయి ప్రసాద్ సేవా ట్రస్ట్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్యం శిబిరంలో ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ జయంతిరెడ్డి సుమారు 100 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ముఖ్యంగా స్త్రీలల్లో ప్రసవం తరువాత తలెత్తే గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, వ్యక్తిగత శుభ్రత వంటి ఆరోగ్య సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ మూర్తి, డాక్టర్ ఎస్‌వీ పీఎస్ మూర్తి పాల్గొన్నారు.

చెరువులో దూకిన మహిళా మృతదేహం లభ్యం

వెంకటమ్మ(ఫైల్)

దుండిగల్, జూన్ 3 : ఆదివారం సాయంత్రం బాచుపల్లిలోని బైరుని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంపంగి వెంకటమ్మ(45) మృతదేహం సోమవారం ఉదయం లభించింది. బాచుపల్లి పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందంతో కలిసి సోమవారం తెల్లవారు జామునుండే గాలింపు చర్యలు చేపట్టగా ఉదయం 10 గంటల ప్రాంతంలో వెంకటమ్మ మృతదేహం లభించింది. బాచుపల్లి, రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన వెంకటమ్మ, ముత్యాలు దంపతులు స్థానికంగా ఇంటిని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో బంధువులతో గొడవలు జరగడంతో మనస్తాపం చెందిన వెంకటమ్మ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు.

గృహిణి ఆత్మహత్య

కొండాపూర్, జూన్ 3 : ఓ గృహిణి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీలో దినేశ్ తన భార్య రాణి (36), ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. కాగా సోమవారం రాణి తన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దినేశ్‌కు ఉన్న అక్రమ సంబంధం కారణంగానే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందంటూ రాణి సోదరుడు దేవరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్, జూన్ 3 : సుచిత్ర నుండి కొంపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న టీఎస్ఆర్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (35-40) మృతదేహం లభ్యమైన సంఘటన పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సంబంధీకులు పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

వరదకాల్వపై నిర్మాణం కూల్చివేత..

దూలపల్లి తుమార్‌చెరువు వరదకాల్వను మూసివేసి చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

కుత్బుల్లాపూర్,జూన్ 3 : కొంపల్లి మున్సిపాలిటీ పరిధి, దూలపల్లి తుమార్‌చెరువులో పట్టా ల్యాండ్‌కు ఆనుకొని ఉన్న చెరువు వరదకాల్వ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన ప్రహరీ నిర్మాణాన్ని సోమవారం అధికారులు కూల్చివేశారు. సర్వే నంబర్ 2,3లలో తుమార్‌చెరువు అలుగు పారే కాల్వ స్థలాన్ని కొంతమంది పూర్తిగా మూసివేసి గోడను నిర్మించారు. దీంతో గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇరిగేషన్, రెవెన్యూ, కొంపల్లి మున్సిపాలిటీ అధికార యంత్రాంగం ఉమ్మడిగా పరిశీలించి.. సోమవారం జేసీబీ సహాయంతో కూల్చివేశారు. అనంతరం హద్దులను ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈఈ నిఖిత, దుండిగల్ మండల ఆర్ఐ భారతి, కొంపల్లి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ భూముల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

కొండాపూర్, జూన్ 3 : శేరిలింగంపల్లి మండల పరిధిలోని మియాపూర్ 100, 101 సర్వే నంబర్లలోని హెచ్ఎండీఏ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను అధికారులు సిబ్బందితో కలిసి సోమవారం కూల్చివేశారు. మియాపూర్ సర్వే నంబర్ 100, 101లోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు హెచ్ఎండీఏకు అప్పగించారు. గతకొంత కాలంగా కొంతమంది పక్కనే ఉన్న ప్రైవేట్ సర్వే నంబర్లకు బై నంబర్లను జోడిస్తూ, తప్పుడు పత్రాలను సృష్టించి దొంగ దారిన రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. వాటితోనే టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా ఇంటి నిర్మాణానికి అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నారు. అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న విషయాన్ని తెలుసుకున్న హెచ్ఎండీఏ సర్వే నంబర్లలోని 14 నిర్మాణాలను కూల్చివేశారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కేఎస్ఆర్‌ను కలిసిన ప్రజలు

దుండిగల్, జూన్3 : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొలన్‌శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన ప్రజలు సోమవారం కేఎస్ఆర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

తెలంగాణ విద్యార్థి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆషాడపు మధు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 3: తెలంగాణ విద్యార్థి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమ నేత ఆషాడపు మధు నియమితులయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మధు పాఠశాల స్థాయి నుంచే తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొని అటు చదువును ఇటు ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి విక్రయం..

వేర్వేరు ప్రాంతాల్లో ఐదుగురు అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3 : జేఎన్‌టీయూహెచ్ మెట్రో స్టేషన్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగురు వ్యక్తులను అరెస్ట్ చేసి.. వారి నుంచి 14.26 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీసుల వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్‌టీయూహెచ్ మెట్రో స్టేషన్‌కు ముంబై నుంచి ఓ వ్యక్తి గంజాయితో వస్తున్నాడని సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి.. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హిమాలయ 1930, ఫిలెక్స్ టాబ్లెట్స్ 60తో కూడిన బాక్స్‌లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వరంగల్‌కు చెందిన పబ్బా సాయితేజ, బస్వరాజు సాయివంశీ, బొల్లారెడ్డి దీపక్‌లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అని తేలింది. వీరు నగరంలోని ఓ ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉంటున్నారు. సాయితేజ ముంబైలో ఉద్యోగం చేస్తున్నప్పుడు మిత్రుడు ఆకాష్‌తో కలిసి డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. అక్కడే ఆకాష్ ద్వారా పరిచమైన రోహిత్ వద్ద గంజాయిని కొనుగోలు చేసి... ఇతరులకు విక్రయించేవాడు. కొద్దికాలం క్రితం హైదరాబాద్‌కు వచ్చిన సాయితేజ గంజాయి కోసం ముంబైలోని ఆకాష్‌ను సంప్రదించాడు. ఈ క్రమంలో జూన్ 1న రాత్రి దీపక్ గంజాయితో నగరంలోని జేఎన్‌టీయూహెచ్ మెట్రో స్టేషన్‌ను చేరుకున్నాడు. దీనిని తీసుకునేందుకు సాయితేజ, వంశీతో వచ్చాడు. అక్కడే ఆ ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని .. 14.26 గ్రాముల గంజాయిని, మూడు సెల్‌ఫోన్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మరో సంఘటనలో ..

కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని రమ్యా గ్రౌండ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొమ్మారెడ్డి సందీప్‌రెడ్డి, కోయ ఉదయ్‌కిరణ్‌లు కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. 2న రాత్రి కాలనీలోని రమ్యాగ్రౌండ్‌లో ప్యాకెట్లలో గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. వారివద్ద 20 ప్యాకెట్లలో ఉన్న 1350 గ్రాముల గంజాయిని, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రభుత్వ అసైన్డ్ స్థలాల ఆక్రమణ..!

- బై నంబర్లతో కొనసాగుతున్న నిర్మాణాలు..
- కిందిస్థాయి అధికారులు, సిబ్బంది అండదండలు..

సర్వేనంబర్ 156లో జరుగుతున్న అక్రమ నిర్మాణం

దుండిగల్, జూన్ 3 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గండిమైసమ్మ-దుండిగల్ తాసిల్ పరిధిలో ప్రభుత్వ అసైన్డ్ స్థలాల ఆక్రమణ జోరుగా కొనసాగుతున్నది. మండల పరిధిలోని పలుప్రాంతాల్లో స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూములకు పక్కనే ఉన్న పట్టానంబర్(బై నంబర్లు) వేస్తూ నిర్మాణాలు కొనసాగిస్తుండగా అధికారులు, సిబ్బంది తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

వివరాల్లోకి వెళ్తే..డీ.పోచంపల్లిలోని గండిమైసమ్మ-దుండిగల్ మండల తాసీల్ కార్యాలయం వెనక ఉన్న ప్రభుత్వస్థలం సర్వేనంబర్ 156లో కొందరు వ్యక్తులు బై నంబర్లు (156/ఏ లేదా 158) సృష్టించి బహుళ అంతస్థుల భవనాలు నిర్మించారు. తాజాగా గత ఆరునెలలుగా మరికొందరు సుమారు 500 గజాల స్థలంలో దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే ఈ భవనాలు రెవెన్యూ శాఖలో పనిచేసే ఉద్యోగిదని తెలుస్తున్నది. అదే గ్రామపరిధిలోని సర్వేనంబర్120/25ల లో రాత్రికి రాత్రే నిర్మాణాలు పూర్తి చేస్తుండగా, సర్వేనంబర్ 118లో కోర్టు ఆర్డర్‌పేరుతో నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కేవలం జీవో నంబర్ 58,59లల్లో దరఖాస్తుచేసుకుని, ప్రభుత్వానికి రుసుం చెల్లించామంటూ నిర్మాణాలు సాగిస్తున్నప్పటికి వారికి ప్రభుత్వ నుండి ఎటువంటి ధ్రువీకరణ పత్రంగానీ,నిర్మాణ అనుమతులు గానీ లేవని తెలుస్తున్నది. వీటన్నింటికి ఓ వీఆర్ఏ అండగా ఉంటున్నట్లు సమాచారం. దీనితో పాటు మండల పరిధి గాగిళ్లాపూర్‌లోని సర్వే నంబర్ 214 ప్రభుత్వభూముల్లోనూ విచ్చవిడిగా భూ ఆక్రమణలు, నిర్మాణాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

కఠిన చర్యలు తప్పవు : తాసీల్దార్ మతిన్

ఇదే విషయమై గండిమైసమ్మ-దుండిగల్ తాసీల్దార్ సయ్యద్ అబ్దుల్ మతిన్‌ను వివరణ కోరగా.. మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ అసైన్డ్‌భూముల ఆక్రమణ జరుగుతున్నట్లు తనకు ఫిర్యాదులు అందిన మాట వాస్తవమేనని అంగీకరించారు. ఇందులో తమ సిబ్బంది ఇద్దరు ఉన్నారనే ఫిర్యాదులపై విచారణ జరుగుతుందన్నారు. విచారణ తర్వాత వారిద్దరిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్ఏను వేరేచోటుకు ఇప్పటికే బదిలీ చేశామని, అయినా అతనిపై ఫిర్యాదులు ఆగడం లేదన్నారు. మరి కొందరు కోర్టు ఆర్డర్‌పేరుతో ప్రభుత్వ స్థలాల్లో రెవెన్యూ, మున్సిపాలిటీల నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు జరిపేవారు జీవో 58,59 ప్రకారం ధ్రువీకరణ పత్రాలుపొంది ఉంటే మున్సిపాలిటీ నుండి నిర్మాణ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏదిఏమైనా అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డ్రగ్స్ విక్రయం.. యువకుడు అరెస్టు

4.1 కిలోల డ్రగ్స్ స్వాధీనం

బాలానగర్ , జూన్ 3 : డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఓ యువకుడిని ఎస్‌టీఎఫ్ పోలీసులు, బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా పట్టుకుని.. 4.1 కిలోల ఏడీఎఫ్ డ్రగ్స్, 1 ఐఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎస్‌టీఎఫ్ పోలీసులు, బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణు తెలిపిన వివరాల ప్రకారం.... షేక్ ఫారుఖ్ చెన్నైలో బీటెక్ చదువుతున్న సమయంలో ఏర్పడిన ఆర్థిక ఇబ్బందులను అదిగమించడానికి బెంగుళూరు నుంచి డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నాడు. ఇందులో భాగంగా సోమవారం కూకట్‌పల్లి వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో విక్రయాలకు పాల్పడుతుండగా .. సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్ సీఐ శ్రీధర్, ఎస్సై రఘు, సిబ్బందితో కలిసి అతడిని పట్టుకుని.. 4.1 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలానగర్ ఎక్సైజ్ పోలీసులకు నిందితుడు ఫారుఖ్‌ను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను అప్పగించారు. ఈమేరకు బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.31, వంకాయ 23, బెండకాయ 38, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 50, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 125, క్యారెట్ 40, కాలీఫ్లవర్ 18, దొండ 18, చిక్కుడు 75, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 21, క్యాప్సికం 55, ఆలుగడ్డ 31, కీరా 23, దోసకాయ 23, సొరకాయ 11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 70, ఉల్లిపొరక 65, ఉల్లిగడ్డ 26, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 23, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 240, చింతపండు 120, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రామలింగయ్య(ఫైల్)

జవహర్‌నగర్, జూన్ 3: వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి చోటుచేసుకుంది. కౌకూర్ ప్రాంతంలోని సుజిత్ గ్రీన్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్ బి బ్లాక్‌లో నూతలపాటి రామలింగయ్య, భార్య లక్ష్మి, కుమార్తెతో కలిసి నివాసముంటున్నారు. రామలింగయ్య ఆర్మీలో పని చేసి ఉద్యోగ విరమణ పొందాడు. కుమార్తె ఉద్యోగరీత్యా చెన్నైలో ఉంటుంది. పెళ్ళయిన ప్పటి నుంచి భార్య లక్ష్మ